"ఏహై పడగొట్టండి, మీకు ఎందుకు మీరు చెప్పిన పని చేయండి. మీ కూలి మీకు వచ్చిద్దిగా, భయపడతారేంరా?" అన్నాడు అప్పారావు.

"చూస్తా చూస్తా ఇంత మంచి గోడని ఎట్ట కూలగొట్టమంటా సామీ? మాకు చేతులు రావద్దూ?" అన్నాడు కూలీల మేస్త్రీ రాముడు.

"నాగోడని నేను పడ గొట్టమని చెపతంటే మీరు అనుమానపడతారేంరా? పడగొట్టడానికి! నాల్రోజుల్లో ఇంకా బెమ్మాండంగా కట్టించనూ గోడ. కానియ్యండి."

"ఏందో అప్పయ్యా... మీ పిచ్చే మీది!" అన్నాడు ఒక కూలి.

"పిచ్చి ఎందిరా ఎదవా.. సిద్ధాంతం రా సిద్ధాంతం! సిద్ధాంతం ప్రకారం నడుచుకోవాలా, పని లేదా?" అన్నాడు అప్పారావు ఒకింత చిరాకుగా.


"ఏందో సిద్ధాంతం అంట! మనకి ఎందుకు మనపని మనం చేసుకుంటే పోయే దానికి!" అంటూ మరోకూలీ గడ్డపలుగుతో గోడమీద శక్తి కొద్దీ ఒక దెబ్బవేసాడు.

"ఠంగ్' మని శబ్దం వచ్చింది కానీ గడ్డపలుగు దెబ్బకి చిన్న పెచ్చుక కూడా ఊడిపడలేదు.

"ఉక్కులాంటి గోడ" అన్నాడు అతను.

"ఉక్కూ లేదు, తుక్కూ లేదూ! కానియ్యండి" అన్నాడు అప్పారావు ఆనందంగా.

కూలీలు పని మొదలు పెట్టారు.



# దోషం

మొలకలపల్లి కోటేశ్వరరావు

అప్పారావు ఇంటిముందు దాదాపు 20 మీటర్ల ప్రహరీ గోడ వుంది.

మొత్తం ముడి గ్రానైట్ రాయితో చాలా పటిష్టంగా కట్టారు. మంచి మంచి డిజైన్లతో అందంగానూ, చాలా గట్టిగాను కట్టారు.

ఆ గోడ కట్టి నిండా రెండేళ్ళు కూడా నిండ లేదు, ఇప్పుడు దానిని పడేస్తున్నారు.

అప్పారావుకి ఇద్దరు కూతుళ్ళు. పెద్ద కూతురికి మేనల్లుడితో పెళ్ళిచేసి, ఇంట్లో తెచ్చిపెట్టుకున్నాడు.

ఆయనకి రైసుమిల్లూ, పొలాలూ, తోటలూ, వడ్డీల వ్యాపారం ఆస్తులు దిట్టంగా వున్నాయి. ఆ ఆస్తులతో పాటు అపారమైన నమ్మకాలు కూడా కొన్ని ఉన్నాయి.

ఎప్పుడూ జ్యోతిష్యుల చుట్టూ, వాస్తు వేత్తల చుట్టూ తిరుగుతుంటాడు.

ఊళ్ళోకి జ్యోతిష్యం చెప్పేవాడో, వాస్తు చెప్పేవాడో ఎవడు వచ్చినా వాడ్ని అప్పారావు ఇంటికి సాదరంగా ఆహ్వానిస్తాడు.

జ్యోతిష్యుడు అయితే తనచేతితో పాటు, ఇంట్లో వాళ్ళందరి చేతులూ చూపెడతాడు.

వాస్తు వేత్త అయితే ఇల్లూ, వాకిలీ, దొడ్డీ, పెరడూ, గోడా, గొబ్బీ - చివరికి లెట్రిన్‌తో సహా అన్నీ చూపెట్టాల్సిందే.

సోదికి పోతే సుద్దులు తక్కువ కాదన్నట్లు వచ్చినవాడు ఏదో చెప్పకమానడు. ఇక అప్పుడు మొదలవుతుంది అయ్యగారి హంగామా.

ఊళ్ళో ఒకతను కొత్త ఇల్లు కట్టించుకుంటూ, ఒక వాస్తు సిద్ధాంతిని ఎక్కడ్నించో పట్టుకువచ్చాడు.

ఆ సిద్ధాంతిని అప్పారావు తన ఇంటికి పిలుచుకుపోయాడు.

ఇంటిని క్షుణ్ణంగా ఓ అరగంట పాటు పరిశీలించాడు సిద్ధాంతి. తరువాత సంచిలో పుస్తకాలు తీసి ఏవో లెక్కలు గుణించాడు.

"ఇంటి వాస్తు అంతా బాగుంది" అన్నాడు చివరకు.

అప్పారావు 'హమ్మయ్య' అని వూపిరి పీల్చి వదిలిపెట్టేలోపే బాంబు పెల్చాడు.


"బయట ప్రహరీగోడ వాస్తుకి పూర్తి విరుద్ధంగా వుంది. ఇంత వాస్తు తప్పుతో కడితే ఇంత మట్టుకీ మీ ఇంట్లో వాళ్ళకి ఎవరికీ ఏం కాలేదా?"

"ఏడాది నించే మా మనవడికి అప్పుడప్పుడు జలుబు చేస్తోంది"

"అద్దీ కత! మరి ఈ గోడ ఇంత తప్పుగా కడితే ఏం జరక్క ఎలా వుంటుంది?"

"గోడలో తప్పు ఎక్కడ జరిగినట్టూ?"

"కొద్ది తప్పుకాదు, పెద్ద తప్పే జరిగింది. నైరుతీలో దక్షణం వైపు పూర్తిగా తిరిగి వుండాల్సిన



భాగం ఉత్తరం వైపు తిరిగి వుంది. వాస్తు ఇలా వుంటం వొప్పుకోదు. ఇది వాస్తుకి బద వ్యతిరేకం''

''మరిప్పుడు ఏం చేయమంటారు?''

''తక్షణం గోడని పడగొట్టాలి. పడగొట్టి, ఉత్తరం వైపు రెండు అడుగులు వదిలిపెట్టి క్రాస్‌గా దక్షణం వైపు తిరిగి ఉండేలా తిరక్కట్టుకో వడమే!''

''మళ్ళీ ఒకసారి చూసి చెప్పండి'' సంకోచిస్తూ, సందేహస్తూ అడిగాడు అప్పారావు.

''ఎన్నో సార్లు చూడాలా? ఒకసారి చూస్తే తెలియదా, నాలాంటి పండితులకి! నేను చెప్పినట్లు చేయండి, మీకు బ్రహ్మాండంగా కలిసి వస్తుంది. ఇక మీ ఇంట్లో ఎవరికీ రోగం రొప్పులు ఉండవు. మీరు పట్టిందల్లా బంగారం అవుతుంది. ఎలాంటి ఇబ్బందులూ రావు!''

''ఆ మధ్య వ్యాపారంలో కొద్దిగా నష్టం వచ్చింది. మా మనవడికి అప్పుడప్పుడూ జలుబు చేస్తోంది. ఎందుకు ఇలా జరుగుతోందా అని ఇప్పటి వరకూ మధనపడి చచ్చాననుకో! ఇందుకే అన్నమాట, ఇప్పటికి అర్థమైంది'' ఉత్సాహంగా అన్నాడు అప్పారావు.

గొప్ప సత్యం కనుక్కున్నట్లూ, పెద్ద గండం ఏదో గడిచినట్లూ ఆనందం కలిగింది. సిద్ధాంతి వైపు ఆరాధనగా చూసాడు.

సిద్ధాంతికి పూనకం వూపు వచ్చింది.

''అసలు నేను చెప్పినట్లు చేస్తే మన ఇండియా కూడా ఎప్పుడో బాగుపడి ప్రపంచంలోనే నెంబర్ వన్ దేశంగా ఉండక పోయిందీ?''

''ఏం చెప్తారేంది?''

''దేశానికి ఉత్తరం వైపున హిమాలయ పర్వతాలు ఉండొచ్చా? అది ఎంత అరిష్టం''

''మరి ఏ వైపు ఉంటే బాగుండేదీ?''

''ఈశాన్యం వైపున ఉండాలి. ఈశాన్య దిక్కున కానీ మనకి హిమాలయ పర్వతాలు ఉంటే అసలు అమెరికాను ఏంటీ, దాని తాతను కూడా తలదన్నే దేశంగా ఉండక పోయిందీ ఇవ్వాళ మనదేశం!''

''మరిప్పుడు ఏం చేస్తే ఆ అరిష్టం పోతుంది?''

''నష్టమో, కష్టమో హిమాలయాల్ని కూలగొట్టి ఈశాన్య దిక్కుకి తరలిస్తే సరి! ఇక మనకి ఎదురే వుండదు''

''అది సాధ్యమయ్యే పనేనా?'' సందేహపడ్డాడు అప్పారావు.

''ఎందుకు సాధ్యం కాదు. ఎప్పుడో చాలా వెనుకటి రోజుల్లోనే చైనా వాళ్ళు వందల కిలోమీటర్ల దూరం గోడ కట్టగా ఈ కాలంలో ఇదేం లెక్క? మన నాయకులకి చేయాలనే చిత్తశుద్ధి వుండాలి!''

''అబ్బే! వీళ్ళకి చిత్తశుద్ధి ఎక్కడవుందీ, ఏ కాడికీ సంపాయిచ్చుకుందామనే తపన తప్ప! అందుకే మన దేశం ఇంత వెనుక బడిపోయింది!''

సిద్ధాంతి మాటలకీ, సిద్ధాంత పరిజ్ఞానానికీ ఆశ్చర్యంలో మునిగిపోయాడు అప్పారావు.

''అసలు అమెరికాలో సెప్టెంబర్ 11 దాడులకి కారణం ఏమిటో తెలుసా నీకు?''

అప్పారావు అమాయకంగా తెలియదన్నట్లు తల అడ్డంగా వూపాడు.

''అక్కడ వాషింగ్టన్‌లోనో, న్యూయార్క్‌లోనో వైట్‌హౌసో, ఏదో వుందంటకదా, దానిలోని

వాస్తే కారణం! ఆ వాస్తు సరిగా వుంటే అసలు ఆ దాడే జరక్కపోయి వుండును''

అప్పారావు నోరెళ్ళబెట్టి, సిద్ధాంతిని ఆరాధనా పూర్వకంగానూ, వినమ్రంగానూ చూసాడు.

''సత్తెం కంప్యూటర్ ఎందుకు దెబ్బతిన్నదను కున్నావు? ఆ కంపెనీ యజమానులు ఎందుకు అవకతవకలకు పాల్పడ్డారో కూడా చాలా మందికి తెలియదు''

''ఎందుకంటారూ?''

''ఎందుకేమిటీ? ఆ కంపెనీ మెయిన్ బిల్డింగ్‌లో చాలా వాస్తు దోషాలు ఉన్నాయి. అందుకే వాళ్ళు అవకవతకలకు పాల్పడి, నష్టపోయి, చివరికి కటకటాల వెనక్కిపోయారు''

''ఓరి నాయనో... మీకు ఎన్ని విషయాలు తెల్సండీ! నేను చాలామంది సిద్ధాంతుల్ని చూసాను కానీ మీ అంత గొప్పోళ్ళని చూళ్ళేదు'' తన్మయంగా అన్నాడు అప్పారావు.

''ఎక్కడ, ఏ వూళ్ళో, ఎంత పెద్ద బిల్డింగ్ అయినా చూపెట్టు. దానికి ఎక్కడ ఏ వాస్తు దోషం వుందో ఇట్టే చెప్పగలను. నేను చెప్పే సిద్ధాంతానికి తిరుగేవుండదు'' ధీమాగా అన్నాడు సిద్ధాంతి.

అప్పారావు ఆయన జ్ఞానానికి ప్రణమిల్లి, భారీగా దక్షణ సమర్పించుకుని, పంచభక్షపరమాన్నాలతో భోజనం వడ్డించి సాదరంగా సాగనంపాడు.

ఆయన చెప్పి వెళ్ళిన మరుసటి రోజే గోడ కూలిగొట్టే పనికి పూనుకున్నాడు.

కూలీల్ని కంట్రాక్ట్‌గా మాట్లాడి పని వొప్పగించాడు.

చాలా మంది కూలీలు పడి, ఎంతో పటిష్టంగా కట్టిన ఆ చక్కటి గోడని సాయంత్రానికి కూల గొట్టి, రాళ్ళని ప్రక్కన పడేసారు.

ఏదైనా నిర్మించడం కష్టం కానీ, కూల గొట్టడం ఎంతసేపు ! చిటికెలో పని!

అప్పారావు వాళ్ళ ఇల్లు అర ఎకరం విస్తీర్ణంలో, పెద్ద పెరడూ, ఇంటికి నాలుగు వైపులా పెద్ద స్తలంతో సువిశాలంగా వుంటుంది.

స్వతహాగా ఆయన మహా పిసినారి. పరమ లోభి. చూస్తూ చూస్తూ పైసా పోనివ్వడే. ఎవరికీ కాణీ ధర్మం చేయడు. అయితే వాస్తు సిద్ధాంతులకీ, జ్యోతిష్యులకీ మాత్రం బాగానే ముట్ట చెపుతాడు.

ఎప్పుడూ వాస్తు సిద్ధాంతులకి ఇల్లు చూపెట్టడం, వాళ్ళు చెప్పినట్లు అటువి ఇటు పెట్టడం, ఇటువి అటు పెట్టడం, కూలగొట్టడం, కొత్తవి నిర్మించడం – ఇంటికి సంబంధించి ఏడాదికి ఒక సారైనా ఏదోపని చేయిస్తుంటాడు.

ఇంట్లో జనాలకి శుభ్రత తక్కువ. దానితో ఏవో రోగాలు వస్తుంటాయి.

పోయిన ఏడాది ఆయన భార్య బాత్‌రూంలో జానెడ ఎత్తున పేరుకుపోయిన పాచికి జర్రున జారిపడి తుంటి ఎముక స్వల్పంగా విరక్కొట్టుకుంది. వెంటనే దొరికిన వాస్తు సిద్ధాంతిని పిలుచుకువచ్చి చూపెట్టి, బాత్‌రూంని ఆ స్తలంలో పడగొట్టి మరోచోట కట్టాడు.

అప్పారావుకి డబ్బుకి కొదువలేదు, ఆస్తికి కొదువలేదు, ఇంటిస్తలానికి కొదువలేదు, నమ్మకాలకి కొదువలేదు. బోలెడు స్తలం వుంది కాబట్టి బోలెడు ప్రయోగాలు చేస్తుంటాడు.

ఇంట్లో ఎవరికి ఏ స్వల్ప అనారోగ్యం కలిగినా వైద్యుడు రావడానికంటే ముందు వాస్తు సిద్ధాంతి వాలిపోతాడు. ఇక ఇంట్లో ఏదో ఒకటి కూలిపోవాల్సిందే, లేకుంటే చిన్నదో చితకదో ఏదో ఒక కట్టుబడి కావాల్సిందే.

అప్పారావు వాళ్ళ ఇంట్లో పెద్ద మామిడిచెట్టు వుండేది. విపరీతంగా కాపు కాసే చెట్టు.

పెళ్ళయ్యి అప్పటికి అప్పారావుకి ఏడాదిన్నర అయింది. పెద్ద కూతురు పుట్టి వుంది. భార్యకి పచ్చకామెర్లు అయ్యాయి.

ఒక సిద్ధాంతి వచ్చి, ''ఇంటి ముందు మామిడి చెట్టు మహమ్మారి లాంటిదండీ! ఉండకూడదు. నిద్రలేచి పాచిముఖంతో పచ్చటి ఆకు ఎలా చూస్తారు? అలా చూడబట్టే ఆమెకి పచ్చకామెర్లు అయ్యాయి. మామిడిచెట్టు ఇంటి వెనుక వుండొచ్చుకానీ, ఇంటి ముందు మాత్రం వుండటం అరిష్టం'' అన్నాడు.

అప్పారావు ఇక ఆ చెట్టుని కొట్టించే పనికి పూనుకున్నాడు. వాళ్ళ నాన్నకి విషయం తెల్సింది.

''మామిడి చెట్టు వుండకూడదని ఏవడ్రా నీకు చెప్పింది? బుద్దీగ్నేనం వున్నవాడెవ్వడూ పచ్చని చెట్టుని కొట్టేయమని చెప్పడ్రా! నాలుగయిదు బండి జల్లల కాయలు కాసే చెట్టు. మనం తినగా ఇంకా సగం వూరికి పందేరం చేస్తాం. అమ్ముకుంటే కావాల్సినన్ని డబ్బులు వస్తయ్యి. చెట్టుకి అవి కాయలు కావు, రూపాయలు! చెట్టుని కొట్టేయమని చెప్పిన వాడికి చాదస్తం వున్నా, వినే వాడికి వివరం ఉండొద్దంట్రా?'' అని వాళ్ళ నాన్న చడామడా కేకలు వేసాడు.

అప్పారావుకి అప్పుడే పంటి నొప్పి వచ్చింది. తనకి పంటినొప్పి, తన భార్యకి పచ్చకామెర్లూ ఆ చెట్టు వలనే వచ్చాయని భావించాడు.

చెట్టుగిలి, చిన్నమొక్కే మహామానై అశాంతికి గురిచేసింది.

వాళ్ళ నాన్నని ఏదో వూరికి పంపించి, చెక్కలు కోసుకునే వాడికి చెట్టుని అమ్మేసాడు అప్పారావు. అంతే, ఆ చెట్టుకి ఆయువు తీరింది. తలుపు చెక్కలుగా మారింది.

అలాగే ఇంట్లో సపోటా కాయల చెట్టూ, ఆరేడు బొప్పాయి కాయల చెట్లూ వుండేవి.

''ఇంట్లో పాలు కారే చెట్లు వుండ కూడదు పాలుకారే చెట్టు వుంటే కలిసిరాదు'' అని ఒక సిద్ధాంతి తీర్మానించాడు.

ఇక ఆ సపోటా చెట్టూ, బొప్పాయి చెట్టూ తెగి కింద పడ్డాయి.

ఇటీవల కాలంలో అప్పారావుకి వాస్తు పరిజ్ఞానం కూడా కొంత ఏర్పడింది. ఊళ్ళ అందరితోనూ వాస్తుకి సంబంధించిన విషయాలు చర్చిస్తున్నాడు. వాదిస్తున్నాడు. చిన్న చిన్న సలహాలు ఇస్తున్నాడు.

నెల రోజులకి ఆ వాస్తు సిద్ధాంతి చెప్పినట్లే తు.చ తప్పకుండా పాటిస్తూ తిరిగి గోడ కట్టించాడు అప్పారావు.

గోడకి పైన సిమెంట్ పూతలూ, రంగులూ వేసారు. గోడ పని మొత్తం అయిపోయింది. పాత గోడకంటే ఇంకా అందంగా, గట్టిగా కొత్త గోడ బాగుంది.


గోడ పని అయిపోయిన మరుసటి రోజే, నిక్షేపంలా, ఆరోగ్యంగా తిరుగుతున్న వాళ్ళ అమ్మకి పక్షవాతం వచ్చింది. కాలూ, చేయీ, నోరూ మూడు పడిపోయి మంచంలో పడింది.

ఆ కుటుంబంలో ఇంతకు ముందు వచ్చిన అన్ని జబ్బులకంటే ఇది పెద్దది.

మరి ఈసారి అప్పారావు ఏం కూలగొట్టిస్తాడో..!

కవిత

# ఓ ఏడు



వసంతాన్ని జేబులో వేసుకున్నా
చిగిర్చిన గుండెలో
కోయిల కూసింది
గ్రీష్మాన్ని గంపలో దాచేశా
మగ్గిన మామిడిపండు
తేనెలు ఊరింది
వర్షంలో నన్ను నే మొలేశా
విరిసిన దేహంలో
బాల్యం ఆడింది
శరత్‌లో మునకలు వేశా
పండు వెన్నట్లో
పరువం పాడింది
హేమంతాన్ని గుప్పెట్లో బిగించా
పిడికిలి తెరిచేదాకా
గింజుకు పోయింది
శిశిరానికి తలుపులు తెరిచా
మోడుల మొదళ్ళలో
జీవం దాగింది
ఆర్రుతువులు కలిపి పేనేశా
కాలంలో ఓ ఏడు
పండై రాలింది

–నారాయణమూర్తి తాతా
సెల్: ***92980 04001***